# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, గురువారం 14 నవంబర్ 2024 RANGAREDDY




మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

## తప్పులకు తావివ్వొద్దు..

### గ్రూప్-3 పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి

### అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబర్ 13 : పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గ్రూప్-3 పరీక్షలో ఎలాంటి తప్పులకు తావీయకుండా సజావుగా జరిగేలా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలకు సంబంధించి చేపట్టాల్సిన విధులు, జాగ్రత్తలపై బుధవారం ఉన్నతాధికారులతో కలిసి కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్ కార్యాలయ సముదాయంలో పనిచేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్స్, రూట్ ఆఫీసర్స్, బయోమెట్రిక్ అధికారులు, పరిశీలకులు, ఇన్విజిలేటర్‌లు, శిక్షణ పొందుతున్న అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు, మార్గదర్శకాలను అందించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలకు 10,196 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 31 కేంద్రాలను గుర్తించగా అందులో వికారాబాద్ మండలంలో 14, తాండూరులో 11, పరిగిలో 5, పూడూరు మండలంలో ఒక కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇలాంటి కీలకమైన పరీక్షను సవాల్‌గా తీసుకొని అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. విధులు నిర్వహించే అధికారులు ఎలాంటి తప్పిదాలు చేసినా తీవ్రమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికే పరీక్ష విధులకు కేటాయించిన అధికారులకు ఎలాంటి మినహాయింపు ఉండదని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు తీసుకురాకుండా ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి పంపించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పూర్తి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. మహిళా అభ్యర్థులను తనిఖీ చేసే క్రమంలో కచ్చితంగా మహిళా సిబ్బంది, మహిళా పోలీసులు ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రానికి గంట ముందే రావడానికి సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. గ్రూప్-3 పరీక్షలు నవంబర్ 17న రెండు విడతలుగా పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, అదేవిధంగా రెండో విడత మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 ఉంటుందన్నారు. పరీక్షా సమయానికి గంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వచ్చేలాగా ప్రణాళికతో ఉండాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్, శిక్షణా కార్యక్రమంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ రీజినల్ కోఆర్డినేటర్లు అరవిందర్‌రెడ్డి, నరేంద్రబాబు, డీఎస్పీ జానయ్య, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నేహమత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

#### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్..

గ్రూప్-3 పరీక్షకు సంబంధించి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. పరీక్షలకు 10196 మంది అభ్యర్థులు హాజరవుతుండగా, 31 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే నవంబర్ 14 నుంచి 18 వరకు ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు **08416235291** టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.



జూబ్లీహిల్స్‌లోని పట్నం నరేందర్‌రెడ్డి నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు సబితారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు



కొడంగల్ కోర్టు ఎదుట పోలీసుల బందోబస్తు

- రాత్రికి రాత్రే మారిపోయిన పరిస్థితులు
- బీఆర్‌ఎస్ నేతలను ఇబ్బంది పెట్టేందుకు యత్నాలు
- అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టు..
- సురేశ్ బీఆర్‌ఎస్ నాయకుడైనా.. ఫార్మా బాధిత రైతేనని స్పష్టం చేస్తున్న స్థానికులు
- బుధవారం ఉదయం నుంచి పోలీసుల హైడ్రామా..

## రణానికి రాజకీయ రంగు!

వికారాబాద్, నవంబర్ 13, (నమస్తే తెలంగాణ): ఫార్మా విలేజ్ భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకుగాను లగచర్ల వెళ్లిన అధికారులపై రైతులు ఎదురుతిరిగిన ఘటనలో హైడ్రామా నడుస్తున్నది.. అరెస్టుల పరంపర కొనసాగుతుండగా రాత్రికిరాత్రే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బీఆర్‌ఎస్ నేతలను ఇబ్బందులకు గురి చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ సర్కార్ వ్యూహాలు పన్నుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫార్మాకు వ్యతిరేకంగా, బాధిత రైతులకు అండగా ఉన్నందుకు మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరెస్టులతో బెదిరించడం సబబు కాదని వారు వాపోతున్నారు. పోలీసులు నిందితుడిగా ప్రచారం చేస్తున్న సురేశ్ కూడా ఫార్మా బాధితుడేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మా పరిశ్రమలు తెస్తామనడం, అరకొర పరిహారం ఇస్తామనడంతోనే వివాదం తలెత్తిందని గ్రామస్తులు చెబుతున్నారు. తమ ఆవేదనను అర్థం చేసుకుని సమస్య పరిష్కరించాలేగాని రాజకీయం చేయవద్దని వారు కోరుతున్నారు. అయితే ఇప్పటికే 16 మంది రైతులను రిమాండ్ చేసిన పోలీసులు బుధవారం మరో నలుగురు రైతులకు పరిగి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించడంతోపాటు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

#### ఉదయం నుంచి ఉత్కంఠ..

హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో బుధవారం ఉదయం వాకింగ్ చేస్తుండగా నరేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణా కేంద్రానికి తీసుకువచ్చిన పోలీసులు, ఐజీ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల వరకు దాదాపు 4 గంటలపాటు పట్నం నరేందర్ రెడ్డిని విచారించారు. విచారణ అనంతరం నరేందర్ రెడ్డిని పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు, తదనంతరం కొడంగల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కొడంగల్ కోర్టులో నరేందర్ రెడ్డిని హాజరుపర్చగా, కోర్టు 14 రోజులపాటు రిమాండ్‌ను విధించింది. ఈ మేరకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. నరేందర్ రెడ్డిని కొడంగల్ కోర్టు నుంచి చర్లపల్లి జైలుకు తరలిస్తున్న సమయంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే రిమాండ్ రిపోర్ట్‌లో మొదట ఏ1గా బోగమోని సురేశ్ పేరును చేర్చిన పోలీసులు తదనంతరం పట్నం నరేందర్ రెడ్డిని ఏ1గా పేర్కొన్నారు. పోలీసుల రిమాండ్ రిపోర్ట్‌లో 47 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు..ఏ2గా ఉన్న బోగమోని సురేశ్‌తోపాటు మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డీటీసీకి తీసుకువచ్చిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్ రెడ్డిలతోపాటు వికారాబాద్, పరిగి నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్ రెడ్డిలు డీటీసీలో పోలీసుల అదుపులో ఉన్న నరేందర్ రెడ్డిని కలిసి ధైర్యం చెప్పి పరామర్శించారు.





కొనుగోలు లేక రైతు ఇంటివద్దనే నిల్వ ఉంచుకున్న పత్తి

## అగమ్యగోచరం

### పత్తి రైతు ఆగమాగం

*జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి ముందు నుయ్యి...వెనుక గొయ్యిలా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడిగా ట్రాక్టర్లు, వ్యాన్ల ద్వారా నిరీక్షిస్తున్నా పట్టించుకోని అధికారులు.. దళారుల వాహనాలు వస్తే మాత్రం నేరుగా కొంటున్నట్లు ఆరోపణలున్నాయి. కేంద్రాల వద్ద మూడు, నాలుగు రోజులపాటు నిరీక్షించడం సాధ్యం కాని అన్నదాతలు పత్తిని తమ ఇండ్లల్లోనే నిల్వ ఉంచుకుంటున్నారు. జిల్లాలో 15 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో కొన్ని మాత్రమే ప్రారంభం కాగా, పూర్తి స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ జరుగడం లేదు. చేవెళ్ల, సంఘీలో గతం లో ఏర్పాటు చేసిన కేంద్రాలు ఈసారి ఇప్పటికీ షురూ కాలేదు.*

*-రంగారెడ్డి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ)*

#### ఆరు వేల ఎకరాల్లో సాగు..

ఆమనగల్లు మండలంలో సుమారు ఆరువేల ఎకరాల్లో రైతులు పత్తిని సాగుచేశారు. వీరు తమ పంటను నల్లగొండ జిల్లా చింతపల్లి సమీపంలో ఉన్న కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లారు. అదేవిధంగా మాడ్గుల మండలంలోని పలు గ్రామాల రైతులు కూడా ట్రాక్టర్లు, ఆటోలు, లారీల ద్వారా పత్తిని అక్కడికి తరలిస్తున్నారు. అక్కడి అధికారులు మాత్రం మూడు, నాలుగు రోజులు నిరీక్షించిన తర్వాతే పత్తిని కొంటున్నారని..అదే దళారులు తీసుకొచ్చిన పత్తిని మా త్రం నేరుగా కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే, ఆమనగల్లు, తలకొండపల్లి, పోలేపల్లి, ఆకుతోటపల్లిలలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉందని వాపోతున్నారు.



కొద్ది రోజులుగా మూతపడిన చింతపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం

#### ఆసాముల పేర్లతో దళారుల అమ్మకాలు..

జిల్లాలో ఈ ఏడాది రైతులు 1.39 లక్షల ఎకరాల్లో పంటను సాగు చేయగా.. 1.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని పలు గ్రామాల్లో పత్తి వ్యాపారం చేసే దళారులు తమ అనుకూల ఆసాముల పాస్‌బుక్కులను చూపించి పత్తిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. వారు తీసుకొచ్చే పత్తికి తేమశాతం తక్కువ ఉన్నా మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తున్నారని.. రైతులు తీసుకొచ్చిన పత్తిలో ఏదో ఒక సాకు చెప్పి, కొర్రీలు పెడుతూ రూ.7200 మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు.

- కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లినా సకాలంలో కొనని అధికారులు
- మూడు, నాలుగు రోజులపాటు తప్పని నిరీక్షణ
- వివిధ కొర్రీలతో అందని మద్దతు ధర
- దళారులకు పట్టని నిబంధనలు.. నేరుగా విక్రయాలు

#### ఇండ్లల్లోనే పత్తి నిల్వ..

జిల్లాలో అధిక శాతం మంది రైతులు తాము పండించిన పంటను ఇండ్లలోనే నిల్వచేసుకుంటున్నారు. పత్తికి గిట్టుబాటు ధర రాకపోగా.. విక్రయించడంతోనూ తీవ్ర ఇబ్బందులు తలెత్తడం, మరోవైపు మంచు కూడా విపరీతంగా కురుస్తుండడంతో తేమశాతంలో వ్యత్యాసాలు వస్తున్న నేపథ్యంలో రైతులు ఇండ్లలోనే నిల్వ ఉంచుకుంటున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద బారులుతీరిన వాహనాలు



నిర్మానుష్యంగా లగచర్ల గ్రామ వీధి

## టెన్షన్..టెన్షన్

### భయం గుప్పిట్లో ఫార్మా పల్లెలు

*ఫార్మా పల్లెలు నిర్మానుష్యంగా మారాయి.. లగచర్లలో జరిగిన రగడతో ఉదయం లేచింది మొదలు.. మళ్లీ తెల్లవారే వరకు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. పోలీసులు ఎప్పుడొచ్చి ఏం చేస్తారో.. ఎవరిని లాక్కెళ్తారోనని పల్లెవాసుల్లో గుబులు నెలకొన్నది. దుద్యాల మండలంలోని హకీంపేట, లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండా నిర్మానుష్యంగా మారాయి. మగవాళ్లు ఊరు విడిచి పట్టణాల్లో పనులకు కొందరు వెళ్తుండగా, కొందరు చెట్లు, పుట్టల వెంట కాలం గడుపుతున్నారు. ఇది ప్రజాపాలనా.. రజకార్ల పాలనా.. అంటూ పల్లెల్లోని మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇక చిన్నారులు, వృద్ధులు అయితే గత్యంతరం లేక బిక్కుబిక్కుమంటూ ఇండ్ల వద్దనే ఉంటున్నారు.*

*- కొడంగల్, నవంబర్13*

- నిర్మానుష్యంగా మారుతున్న దుద్యాల మండలంలోని హకీంపేట, లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండా
- పోలీసులు ఎప్పుడొచ్చి దాడి చేస్తారోనని ఆందోళన
- గ్రామాన్ని విడిచి బయట ఉంటున్న మగవాళ్లు
- కాంగ్రెస్ సర్కార్ జనాన్ని పీడిస్తున్నదని దుమ్మెత్తిపోస్తున్న మహిళలు
- చిన్నారులు, వృద్ధులు బిక్కుబిక్కుమంటూ ఇండ్ల వద్దనే..

ఫార్మా చిచ్చుతో చెలరేగిన సంఘటనతో దుద్యాల మండలంలోని హకీంపేట, లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లోని ఫార్మా భూ బాధితుల్లో భయం నెలకొన్నది. ప్రశాంతంగా ఉంటే లగచర్ల గ్రామంలో రజాకార్ల పాలన గుర్తుకొస్తున్నదని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. భూములు కోల్పోతున్నామన్న బెంగతో తిండి, తిప్పలు మాని దిగులుచెందుతున్నారు. ఇటీవల జరిగిన ఘటనతో ఫార్మాకు సంబంధం లేని వారిని తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది నెలలుగా ఫార్మా భూ సేకరణకు ఇబ్బందులు పెడుతున్నారని, ఇవ్వబోమని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఎవుసం చేసుకునే బతుకుతామని, మా జీవనాధారమైన భూములను లాక్కుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. లగచర్ల ఘటనకు ముందే భూ సేకరణ కోసం రావద్దని దుద్యాల మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశామని గ్రామస్తులు తెలిపారు. రైతుల అభీష్టం, ఆవేదనను గుర్తించని కాంగ్రెస్ సర్కార్ పోలీసులతో దాడులు చేయించడం సరికాదని వాపోతున్నారు.

#### గ్రామాల్లో ఉండాలంటే భయంగా ఉన్నది..

లగచర్ల ఘటనతో గ్రామంలో ఉండాలంటేనే భయంగా ఉన్నదని యువకులు ఆవేదన చెందుతున్నారు. ఉన్న ఎకరం, రెండు ఎకరాల పొలంలో పంట వేసుకుని ఆనందంగా జీవించే మాకు కాంగ్రెస్ వచ్చి కష్టాలు తెచ్చిపెట్టిందని బోరుమంటున్నారు. పోలీసులు ఎప్పుడు వచ్చి ఎవరిని తీసుకెళ్తారోనని భయం పట్టుకున్నదని పేర్కొంటున్నారు. గ్రామాన్ని వదిలి వేరే ప్రాంతాలకు వెళ్తున్నామని, పిల్లలు, వృద్ధులు ఇండ్ల వద్దనే ఉంటున్నారని, ఇలా ఉండాల్సి వస్తుందని ఎన్నడూ అనుకోలేదని తమ గోడును వెళ్లగక్కుతున్నారు.

#### పొట్ట కూటి కోసం..

పొట్ట కూటి కోసం తండాల్లోని మగవాళ్లు దూర ప్రాంతాలకు వెళ్లి కూలి పనులు చేస్తున్నారని, పిల్లలు, వృద్ధులు పశువులు, మేకలను మేపుకొంటూ జీవిస్తున్నారని మహిళలు తెలుపుతున్నారు. అర్ధరాత్రి ఇండ్లల్లోకి చొరబడి అరాచకం సృష్టిస్తారేమోనని జంకుతున్నారు. ఇండ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి బతుకుతామని పేర్కొంటున్నారు.